# మాజీ మహారాజ రాజశ్రీ

సెటైర్

మహారాజ రాజశ్రీ శ్రీ భువనగిరి శేషగిరి గారి దివ్య సముఖమునకు,

నమస్కారోభయ కుశలోపరి. ఈసారి ఎందువల్లో తమరు సెలవులకు స్వగ్రామం రాలేదు. ఈవిషయం గురించి చాలామంది మిత్రులు అడిగారు. బహుశా, ఉద్యోగ సంబంధమైన పని వల్ల రాలేదనుకుంటాను.

ఒక చిన్న మనవి. తమకు గతసంవత్సరం నావద్దగల రు 500 లు ప్రామిసరీ నోటుమీద అప్పుగా ఇచ్చిఉన్నాను. కొన్ని కుటుంబ పరిస్థితులవల్ల నాకు ఆ మొత్తం అవసరంగా కావలసివచ్చినది. విధిలేక తమకు రాయటం జరిగింది. అన్యథాతలంచవద్దని ప్రార్థన. తమకు వీలైనంత త్వరలో పంపగలరని ఆశిస్తున్నాను. తప్పనిసరిగా ఇలా వ్రాసినందుకు క్షమించవలెను.

చిత్తగించవలెను,
అగ్రహారం 12—1—53 భవదీయుడు,
అప్పల నరసింహం.

(2)

మహారాజ రాజశ్రీ భువనగిరి శేషగిరిగారి దివ్య సముఖమునకు,

నమస్కారోభయ కుశలోపరి. కిందటి నెల పధ్నాలుగో తారీకున తాము రాసిన జాబు చేరినది. బహుశా, సకాలంలో మీకు రావలసిన డబ్బు అంది ఉండదు. ఒక నెలరోజులలో సర్దుబాటుచేయ ప్రార్థన. తమకు శ్రమ కలిగిస్తున్నందుకు క్షమించవలెను.

అగ్రహారం, 16-2-53. చిత్తగించవలెను, భవదీయుడు,
అప్పలనరసింహం.

(3)

మహారాజ-శ్రీ భువనగిరి శేషగిరిగారి దివ్య సముఖమునకు,

నమస్కారోభయ కుశలోపరి. తమరు కిందటి నెల 18వ తారీకున రాసిన జాబు చేరినది. రొక్కం చాలా అవసరముగా ఉన్నది. దయఉంచి రెండు వారములలోగా ఆ మొత్తంపంపితే ఎంతో సహాయంచేసినట్టుగా భావించగలను. పరిస్థితుల వత్తిడి అలా ఉన్నది. క్షమించవలెను.

అగ్రహారం, 18-3-53. చిత్తగించవలెను, భవదీయుడు.
అప్పలనరసింహం.

(4)

రాజశ్రీ భువనగిరి శేషగిరిగారి దివ్య సముఖమునకు,

నమస్కారోభయ కుశలోపరి. కిందటి నెల 20వ తారీకున తమరు రాసినజాబు అందినది. గడువులోపల బాకీ తప్పక తీర్మానం కాగలదని ఆశపెట్టుకొని ఉన్నాను. నిరాశ ఐనది. చాలా ఇబ్బందిగా ఉన్నది. ఒక వారములోగానే తప్పక చెల్లించగలరని నమ్ముతున్నాను.

అగ్రహారం, 4-4-53 చిత్తగించవలెను, భవదీయుడు.
అప్పలనరసింహం.

(5)

శ్రీ భువనగిరి శేషగిరిగారి దివ్యసముఖమునకు,

నమస్కారోభయకుశలోపరి. తమజాబు చేరినది. కాని తమకు నామీద దయకలుగలేదు. ఈ జాబుచేరిన రెండుమూడు రోజులలోనైనా ఋణంతీర్మానం చేయించ ప్రార్థన.

అగ్రహారం 12-4-53 చిత్తగించవలెను,
భవదీయుడు, అప్పలనరసింహం.

(6)

భువనగిరి శేషగిరిగారి సముఖమునకు,

నమస్కారోభయకుశలోపరి. తమవద్దనుంచి జాబులేదు. ఈజాబు అందిన తక్షణం తమరు మనీ ఆర్డరుద్వారా అసలీఫాయిదాలు పంపవలసినది. తిరుగుటపాక్తై నిరీక్షిస్తుంటానని గమనించవలెను.

అగ్రహారం 18-4-53 చిత్తగించవలెను,
అప్పలనరసింహం.

"హితశ్రీ"